# అమ్మగారి అవసరం

మూడురోజులు యెడతెరిపి లేక కారుమబ్బులు వేసి, ఏకధారగా వర్షం కురిసి, ఆ సాయంత్రమే చీకటిపడేముందు వెలిసింది. భోజనంచేసి డ్రిప్పీనూపరెంటు నరసింగరావు బంగాళావరండాలో నుంచుంటే జలప్రళయం మధ్య మా చిన్న తోటా మేడా తేలుతున్నట్టుగా వుంది. ఆ చలిలో కప్పలు బూజంబంతిపాటలు పాడుతున్నాయి. మా సిగరెట్లపొగ చలిలో చీకట్లో బైటికి పోవడానికి వెరిచి మా చుట్టుప్రక్కనే వేళ్ళాడుతోంది. నాకట్లాంటి కథల్లో సరదా పోలేదని తెలిసిన నరసింగరావు, ఆవూళ్ళో గొప్ప వర్తకుడి భార్య ఒకనాడు చప్పున వాళ్ళ వకీలింటికి లేచిపోయి మళ్ళీ రానన్న సంగతీ, ఆ వకీలు తన తప్పులేదని ఆ వర్తకుడికాళ్ళు పట్టుకోడమూ చెపుతున్నాడు. ఇంతలో జవానొకడు వచ్చి శాల్యూట్ చేసి నుంచున్నాడు. "యేం, భవానీసింగ్, యివాళంతా మళ్ళీ యెగేశావుకదూ?" అన్నాడు నరసింగరావు.

"పనివుండి రాలేదు." అన్నాడు జవాను నిర్లక్ష్యంగా.

"ఇదే ఆఖరుసారి నీకు చెప్పడం, యీసారి."

"నాకు బదిలీ చేయించండి."

"బదిలీ కాదు, డిస్మిసు చేయించండి, అను."

"డిస్మిసే! చేయించండి, తెలుస్తుంది".

"సరేలే, వెళ్ళు వెధవబెదిరింపులు."

"సంగతులు బైటికి రావా?"

"ముందు నడు" అని నరసింగరావు లేచి వాణ్ణి తన్నబోయినాడు. ఆ జవాను కళ్ళు చూస్తే, నరసింగరావుమీది ద్వేషంతో నిండి మెరుస్తున్నాయి. వెంటనే బొడ్లోంచి కత్తితీసి, పొడవడు కదా అని నాకు భయమేసింది. నే నడ్డపడి, వాణ్ణి పొమ్మన్నాను. వాడు పోయిం తరువాత సగం సిగరెట్టుకాల్చి చప్పున నరసింగరావిట్లా అన్నాడు.

"చూశావా, నాముందులేదూ గోపాలయ్యర్ వాడు వీణ్ణిట్లా చెడ

గొట్టాడు, వెధవ, జవానుగాణ్ణి! ఆదో చిత్రమైన కథ, ఈ లోకంలో యెన్ని తమాషాలనీ! బయటికి చెప్పామా అన్నీ అబద్ధాలంటారు ప్రతిష్టకోసం! నీ కథలెందుకు, నా స్వతం ముందు!

ఆర్నెల్ల క్రిందట గావును, విజయనగరం నించి యీ వూరు పాష్ట్యనికివొచ్చి యితని యింట్లో—అంటే యీ బంగాళాలోనే, గోపాలయ్యర్ గెస్టుగా దిగాను, సరిగా యిట్లాంటిరాత్రి భోజనంచేసి ఆ పక్కగా కూర్చున్నాం, డిపార్టుమెంటు కబుర్లు చెప్పుకుంటో. చక్కని యెండాకాలపు గాలి నా కళ్ళకు నిద్రని తెచ్చింది. పడుకుంటావా, అని నన్నడిగి, యీ భవానిసింగుని యింటికి పొమ్మన్నాడు. కాని మూడుసార్లు చెప్పినా వీడు కదలకపోవడం నా కాశ్చర్యం వేసింది. ఏదో వంటరిగా గోపాలయ్యర్‌తో వాడు మాట్లాడాలి గావుననుకుని లేచాను. అయ్యర్ నాతో లాంతరు తీసుకొచ్చి దక్షిణవేపు గది తేపూ మేడమీద ఈ రాత్రి నువ్వుదాంట్లోనే పడుకుంటావు-దాంట్లోవిడిచి కిందికి వొచ్చాడు. నేను సిగరెట్టు అవతల పారేసి, సంచీలో నించి నవల తీశాను. కాని కిటికీలోంచి బయటికిచూస్తే చుట్టూ అందమైన చీకటి, చీకటికంటె నల్లగా తుమ్మచెట్లు వూగుతున్నాయి. చీకటి కాంతి నీళ్ళమీద కొంచెంగా ప్రతిఫలించడంవల్ల నీళ్ళు మెరుస్తున్నాయి. అంతవానకికూడా ఆరని నీలపుదీపాల్ని మోసుకుంటో మిణుగురు పురుగులు ఆకుల్లో వుత్సవం చేసుకుంటున్నాయి. మబ్బులు దెయ్యాలవలె ఎగిరిపోతున్నాయి ఆకాశంమీద. అట్లాగే కిటికీదగ్గిర ఆగిపోయి, చూస్తోకూచున్నాను మళ్ళీ సిగరెట్ వెలిగించి పక్కతలుపులోంచి జాజిపువ్వుల పరిమళం తగిలింది. తలతిప్పి చూశాను. పద్ధెనిమిదేళ్ళ అమ్మాయి సిగ్గుపడుతో నడిచి వొచ్చి నావంకనైనా చూడక తలవొంచుకుని, నాముందు నుంచుంది యేం చెప్పను? ఈ నాటికికూడా ఆ క్షణాల అనుభవం నన్ను విడువలేదు. ఏనాటి రాత్రి అట్లా మళ్ళా వొణుకుతున్న వేళ్ళతో నడిచివొచ్చి దీనంగా నాముందు నుంచుంటుందో అనుకుంటాను. ఆమె యీ మేడను ఆశ్రయించిన యే గృహదేవతో అనిపించింది. గదంతా ఆమె తల్లోని జాజిపువ్వుల వాసనతో నిండింది. ఆమె వొంటికి రాసుకున్న జవ్వాజి గంధం నన్నలముకుంది. అట్లా పరిమళాల్ని ఉపయోగించే తెలుగువాళ్ళని చూసింది ఒక్క పరిమళ కేమిటి

ఆచేతుల గట్టితనమూ, నడుమువొంపూ, ఆ పాదుగులోని నవనవా, ఆ చెక్కిళ్ళ కోలతనమూ, కళ్ళలో బెదరూ, పువ్వుల్లోని వాసనలాగు కనపడి దాక్కునే సిగ్గూ అన్నీ అరవజాతి లావణ్యాలే. నామనసు వూటలూరింది.

"ఎవరు ?"

తలెత్తింది. గోపాలయ్యరు భార్య! చప్పున లేచాను.

"ఎందుకు వొచ్చావమ్మా!"

మెల్లిగా కాటుక రెప్పల్ని యెత్తి మళ్ళా వాల్చింది. పశువుకి, నపుంసకుడికి పసిపిల్లవాడికి అర్థమౌతుంది, ఆ చూపు, నాకా! నా వొళ్లంతా ఆ వొక్కచూపు నా నరాల తంతులమీద గాఢమైన సంగీతం పాడింది. గోపాలయ్యరూ స్నేహమూ యేమీ జ్ఞాపకం లేదు. ఈ అదృష్టం, నిజమేనా, కలకాదు గద! యేం చెయ్యాను? ఎందుకు వొస్తుంది? అంత సాహసమా? కనుక్కోరా?

"ఎందుకు? అన్నాను.

మళ్ళా చూచింది, యీసారి కళ్ల పక్కలనించి, నన్ను చూసింది. ఆ హృదయం సంతోషిస్తోందనీ, ఆశిస్తోందనీ, ఎంతో గర్వం వచ్చింది. కాని అయ్యర్ కనుక్కుంటే! తలుపు గడియన్నా లేదు. మళ్ళా తలుపు తెరుస్తున్నారు. ఎవరో! "నే నేమెరగను తీసు కెళ్ళ" మని అనాలనుకున్నాను. కాని నమ్ముతాడా? అని భయమేసింది. ఇదో అల్లరా యిక్కడ! నన్ను నమ్మివచ్చిన పిల్ల నన్యాయం చేస్తున్నాననే ఆలోచనే లేదు. కాని ఆమె ముఖం నిశ్చలంగానే వుంది. వాళ్ళ ముసలమ్మ లోపలికివొచ్చి వెండిచెంబూ, పళ్ళెంలో మిటాయీ, పళ్ళూ పెట్టిపోయింది. అమ్మాయి అట్లానే నుంచుని వుంది. ఈ ముసలమ్మా యీ పిల్లా కలిసిచేసిన ఆలోచనా?

"గోపాలయ్యరికి తెలుసునా?"

తల వూయించింది. ఇదేదో కొత్తమర్యాదగా వుందే!

"రా, యిట్లాకూచో"

"మీరుకూడా కూచోండి"

యిద్దరమూ పక్కగా కూచున్నాము. ఆమెచేతిని నాచేతితో పట్టుకున్నాను. తృప్తితో కూడిన చిన్న నవ్వు నవ్వింది, ఆ తాంబూలం కెంపుల

చివర్లనించి. నా ప్రిన్సిపిల్సు నీకు తెలుసు కదా? ఎంత స్వేచ్ఛగా విహరించినా, స్నేహితుల యిళ్ళల్లో కళ్ళు త్రిప్పడం నాకు మనస్కరించదు. అలాంటు ముందువరకూ ఆతురతతో కబుర్లుచెప్పి, యిప్పుడు మిత్రుడు గోపాలయ్యర్ సంసారాన్ని యిట్లా పాడుచెయ్యడం, నాకు మనస్కరించలేదు. కాని అతనికి తెలీకుండా రావడం అసంభవం కాదా? నా అనుమానం గ్రహించిందో యేమో బిక్కపోయి నాముఖం వెతికే, ఆ చిన్న కోలముఖమూ, ఆ పల్చని చిన్న పెదిమలూ చూసేటప్పటికి నా సందేహాలు మాయమైనాయి. "మీ కోసం" అంది, ఎంత ఆకలిగావుంటే, ఆ మాటలు ఆ ముగ్ధ సిగ్గుతో వాలిపొయ్యే పెదవుల్లోంచి అనకలిగిందో అనుకుని...మధ్య రాత్రి మెళుకువ వొచ్చింది. ఎవరో గదివెనక తలుపుపైకి యెగబాకుతున్నట్లు చప్పుడయింది. నా చేతిమీదా, మెడమీదా, వున్న మెత్తటిజుట్టుని మెల్లిగా తప్పించుకుని చూశాను పైన వంటిలేటుగులోనించి రావాలని ప్రయత్నం కాదుగద! చప్పున లేచాను. రుక్మిణీ లేచింది. తలుపు తెరవబోతోవుంటే చప్పున చెయ్యిపట్టుకుని వెళ్ళవద్దంటుంది. ఎంత భయం లేదన్నా వినదు, గట్టిగా నన్ను పెనవేసుకుని, కళ్ళు నీరగాపెట్టి, ముద్దుగా, "నన్నువిడిచి వెళ్ళవొద్దం"టో వుంటే యేంచెయ్యను? వూడిపోయేచీర వూడకండా, నాకు నగమునానించి, రెండు చేతులతో నా కంఠాన్ని కౌగలించుకుని పైకెత్తిన మొహాన్ని ముద్దుపెట్టుకోక, బైటికి పరిగెత్తనా! దొంగలైతే, వాళ్లపని తరవాత! "నన్ను చూడనీ ఒక్క నిమిషం".

"వొద్దు. ఎవరూలేరు?" అని బిగ్గిరిగా "ఎవరది? పో, బుద్ధిలేదూ?" అంది. ఆ చప్పుడాగింది. పళ్లు పటపట కొరుకుతున్నాడా ఆబైట మనిషని పించింది. గోపాలయ్యరికి అగపడదెందుకు? పెళ్ళాన్ని చూస్తే భయమా? రుక్మిణిమొహం చూశాను, ఛా, నమ్మకద్రోహం చేసేముఖమా అది, అనుకుంటోనే పక్కని వున్నని రొమ్ముమీద జాజిపువ్వుల, జవ్వాదివాసనల్లో, రెండు చేతులమధ్య నిద్రపోయినాను.

తెల్లారి కళ్లు తెరిచేటప్పటికి రుక్మిణి తల సద్దుకుని, చీర సరిగా కట్టుకుని, నావంకనవ్వుతో చూస్తో కూచునివుంది. ముఖం ఆనందంతో సంతుష్టితో కలకలలాడుతూంది. నా ప్రజ్ఞకి నాకు గర్వంగావుంది. వింత కాంతితో

Donated In Memory of

కళ్లు మెరుస్తున్నాయి. కొత్త కోర్కెతో చేతులుజాచి తలను మీదకి లాక్కున్నాను.

"వొద్దు, మళ్ళీ, రాత్రి." అన్నది. "నేను వెళుతున్నాగా యివాళ" అన్నాను దిగులుగా. "వొద్దు" అన్నది.

"వెళ్ళాలి"

"వొద్దు"

వొద్దు అన్నప్పటి నన్ను కట్టేసే చూపు, ఆ చిన్నతలవూపు, కళ్ళ బెదురు, అన్నీచూసి యేామనను! కానియెట్లా వుండడం?

"యేామని చెప్పి వుండను? నాపని ఐపోతుంది"

"నాతోనే మీపని, నేను చెపుతాగా! సరేనా!" అని చప్పున వెళ్ళి పోయింది. మళ్లీ చప్పునే వొచ్చి "పర్సు యేదీ"

అని, నాజేబులు తడిమి, పర్సుతీసి, "యీ ఐదురూపాయలుచాలుగా యీవాల్టి ఖర్చుకి? సరే అని ఒకనోటు నాకిచ్చి పర్సు తీసుకుని వెళ్ళి పోయింది.

అట్లాగే పడుకుని ఆలోచించుకున్నాను. ఈ గోపాలయ్యర్‌కి నాతో డిపార్టుమెంటు పనిలేదు. లేక డబ్బుసంపాదించే వ్యాపారమా? నాపర్సు తీసుకోడం అదే వుద్దేశ్యమేమో, కాని రుక్మిణి చేస్తుందా అల్లాంటిపని! చెయ్యదు. లేచాను, కిందికివెళ్ళి గోపాలయ్యర్ని చూడడమంటే సిగ్గేసింది. కానీ కాఫీదగ్గిర అతను యేమీ జరగనట్టే మామూలుగానే మాట్లాడాడు. రుక్మిణి నన్ను చూసి యెప్పటిమల్లేనే, సహజంగా సిగ్గుపడి మాయమౌతోంది.

ఆనాడు కోర్టులో యిన్స్పెక్టరు శంకర్రావు కనపడ్డాడు. వాడూ నేనూ చిన్నప్పటి స్నేహితులం. "బసెక్కడ?" అన్నాడు.

"గోపాలయ్యర్ తో"

"సరే, యింకేం? అన్నీ సలక్షణంగా జరుగుతూన్నా యన్నమాట! అసాధ్యుడివి!" అని నవ్వుతో భుజంమీద తట్టాడు. నేను కోపం మొహం పెట్టి "అంటే?" అన్నాను.

"బూతరిటదు, తెలీంది యేమీలేదు." అని వెళ్ళి పోయినాడు.

నాకు మరీ ఆశ్చర్యమేసింది. ఇది తప్పకుండా డబ్బులాగే వ్యవహారమే !! ఇక యీ రాత్రి వొస్తుందా ! డబ్బంతా లాగిం తరవాత ! కాని రుక్మిణి చూపు, వెళ్ళవద్దని బతిమాలుకోడం ! నేను నమ్మలేకపోయినాను. కాని రుక్మిణిమీద అనుమానమూ అసహ్యమూ పొడచూపుతున్నాయి నా మనసులో.

ఆ రాత్రి నేను తోటముందు నుంచుని వుండగా యీభవానిసింగు వొచ్చి, సలాంచేసి, "కోర్టులో మధ్యాహ్నం పని అయిపోయింది కదా?" అన్నాడు. "ఏమిటి?" అన్నాను.

"మీరు వొచ్చినపని."

"ఐతే ?"

"యింకా వెళ్ళలేదేం ?"

వీడేమన్నా మూఢుడా ! పిచ్చివాడా ? — "నీ కెందుకు ?

"వెళ్ళండి" అన్నాడు, బెదరింపు కంఠంతో. "గెట్ ఎవే" అని తన్నపోయినాను. వాడు వెకతో "నామాట విని వెళ్ళండి" అన్నాడు.

మధ్య వీడికెందుకు ? వీడికేం తెలుసు ? అని ఆలోచించాను. కాలనచేసి అడగవలసింది అనుకున్నాను. రాత్రి మళ్లీ గోపాలయ్యర్ సన్న గదిలో వొదిలాడు. రుక్మిణి కొర్నాటిచీర సింగారించి వొచ్చింది. నేనా రాత్రి యేమనుభవించానో మాటలతో చెప్పతరంకాదు. ఇదిమాత్రం నిశ్చయంగా చెప్పగలను, గ్రీస్‌లో పడకగదుల్లో, తెలుగుస్త్రీలు అరవ స్త్రీలతో, యేమాత్రమూ యీడు రాలేరు. ఆ అభిప్రాయంమీదే అరవమ్మాయిని పెళ్లిచేసుకుందామని వెతికాను, కాని వాళ్లిస్తారా ? యిట్లా లభించవలసినదే గాని ! మతం తగలపడదూ? తెల్లవారకట్ట లేచినప్పుడు, నే నావాళ వూరుకి వెడతానని ఆమె నొప్పించాను, కష్టంమీద. రుక్మిణి ప్రేమలో నా అనుమానాలన్నీ కరిగిపోయినాయి; వాటి సంగతి తలపెట్టలేదు. తీక్షణమైన వూపిర్లమధ్య సమస్య ఆలోచించడానికి వ్యవధి వుందా ! సౌందర్యం గుర్తించి అనుభవించడం చేతగాని దౌర్భాగ్యుల కదంతా ! నీకూ, నాకూనా!

కాని రుక్మిణి వెళ్ళగానే నా సందేహాలన్నీ వొచ్చాయి. డబ్బు కాజేసిందిక ! ఆరెండు రాత్రులకు వెల వందా యిరవై మూడు రూపా

యేం! కాని యెన్ని లక్షలున్నా నిర్లక్ష్యంగా యివ్వనా? లేను! కాని ఆ ప్రేమ చూపడం అంతా డబ్బుకోసం అనేనా? ఎంత మోసపోయినందుకు నామీద నాకే అసహ్యం వేసింది. యింటికి వెళ్ళడమెట్టా గోపాలయ్యర్ని అప్పు అడగాలా!

మధ్యాహ్నం కోర్టుకి వెళ్తో జేబులో చెయ్యిపెడితే పర్సు ఎక్కడిది? దొంగ రాత్రి యెప్పుడో పెట్టింది తెరిచాను! దాంట్లోంచి యిన్ని జాజి పువ్వులు రాలాయి రూపాయలకి బదులు! జాజిపువ్వులు నూటయిరవై మూడు రూపాయల ఖరీదా? లోపల యింక యేమో వున్నాయి! రూపాయలన్నీ వున్నాయి పైగా ఒక వుంగరం! ఆ రుక్మిణిమీద పడ్డ అనుమానానికి నన్ను నేను తన్నుకోవాలనిపించింది. ఇంతకీ సమస్య యేమి అంతం కాలేదు ఈ సంగతేదో తెలుసుకున్నదాకా వుండలేను రుక్మిణిని రాత్రి ప్రశ్నిద్దామంటే నోరు రాలేదు కొంచెంగా మొదలుపెట్టినప్పుడల్లా పెదిమలతో, తాంబూలం వాసనలతో అడ్డంపెట్టింది శంకర్రావుని పట్టుకుని అడిగాను. జరిగినదంతా ముందు నాదగ్గిర్నించి లాగాడు అతను పోలీసువాడయ్యేను

"తెలీటంలా! గోపాలయ్యరు ముసలివాడు. ఎవరన్నా పెద్ద మనుషులొస్తే భార్యని పంపుతాడు వాళ్ళ గదిలోకి"

"ఎందుకు?"

"ఏం చేస్తాడు?"

"మరెందుకు పెళ్ళిచేసుకున్నాడు?"

"ఏమో యే తల్లిబాధో పడలేకపోయి వుంటాడు."

"వెధవ"

"లేదు నా కతన్ని చూస్తే చాలా గౌరవంగా వుంది"

"అవును భార్య అవసరం గుర్తించే భర్తని వేలెత్తి చూపు"

"సరేలే ఆ భవానీసింగ్"

"యింకేముందీ! యింకెవరూ దొరక్కపోతే, పదిగంటలప్పుడు 'భవానిసింగ్ అమ్మగారి నవసరించాడు' అంటాడు. అందుకే నే ఎవరు వొచ్చినా కదుస్తాను, ఆ జవాబుగాను."